# మరోదారి

"ఇంతకన్నా చావడం నయం!" అంటోంది శ్యామల గట్టిగానే, కూతురు సుహాసిని వంటింట్లోకి వచ్చేసరికి. తల్లి అలా అనడం, కూతురు వినడం అది మొదటిసారి కాదు.

ఇంట్లో ఏ ఇబ్బంది ఎదురైనా, దాన్ని ఎదుర్కోలేని నిస్సహాయత ఏర్పడినప్పుడు చావుని కోరుకుంటుంది తల్లి. ఆ ఇబ్బంది ఎలాగో గడిచిపోగానే తల్లి మామూలు మనిషి అవుతుందని సుహాసినికి తెలుసు. అందుకే తల్లి మాటలు విని నవ్వింది. కూతురి నవ్వు వినగానే శ్యామలకి చిర్రెత్తుకొచ్చినట్లుంది.

"ఎందుకే ఆ నవ్వు?" అంది కూతురికేసి ఉరిమినట్లు చూస్తూ.

"అవును, ఇప్పుడు ఏమంత కష్టమొచ్చిందని–చావడం నయం అంటున్నావు? నువ్వేనా, ఇంట్లో అందరం చావాలా?" అంది సుహాసిని వెటకారంగా.

"మీరెందుకే మధ్యలో? మీ నాన్నని చేసుకున్నందుకూ, మిమ్మల్ని కన్నందుకూ నేను చావాలి గానీ--" అంది శ్యామల సాగదీస్తూ.

"ఇప్పుడేమైందని అంత నిష్ఠూరంగా మాట్లాడుతున్నావ్? దేనికంతగా బాధపడి పోవడం?" అంది సుహాసిని తల్లిని శాంతింపజేద్దామని.

"అవునే, నావల్లనే కదా నీకు ఏ సంబంధమూ కుదరడం లేదు!" అంటూ శ్యామల కళ్ళు ఒత్తుకుంది.

"అదేమిటమ్మా? నీ వల్ల సంబంధాలు కుదరకపోవడం ఏమిటి? నువ్వేం చేశావని?" అంటూ సుహాసిని నిజంగానే ఆశ్చర్యపోయింది.

"నేను నల్లగా ఉండబట్టే కదా నువ్వూ నల్లగా పుట్టావు! నీ నలుపు చూసే కదా పెళ్ళి చూపులకి వచ్చిన వాళ్ళు తిరిగి వెళ్ళిపోతున్నారు. అందుకే, మీ బామ్మ తన కొడుక్కి నన్ను చేసుకోవడానికి ముందు ఇష్టపడలేదు. "కోడలు నలుపైతే కులమంతా నలుపు'

అనే సామెత ఉందిట. ఆవిడ అన్నట్లే అయింది" అంది శ్యామల నేరం చేసిన దానిలా తలదించుకుని.

"ఏమిటమ్మా ఆ మూఢ విశ్వాసాలు! తల్లిరంగే పిల్లలకి వస్తుందని జన్యు శాస్త్రంలో ఎక్కడా చెప్పలేదు. తండ్రి రంగు రావచ్చుకదా" అంది సుహాసిని.

"నీ దురదృష్టం కొద్దీ నా రంగే వచ్చింది నీకు" అంది శ్యామల నీరసంగా.

"పోనీలే అమ్మా, నా నలుపు నచ్చినవాడే చేసుకుంటాడు. ఎవడో నా కోసం పుట్టే ఉంటాడు-ఎక్కడో ఉండే ఉంటాడు. నాన్న నిన్ను చేసుకోలేదూ. అలాగే!" అంది సుహాసిని తేలిగ్గా నవ్వుతూ.

"ఆ, చేసుకున్నారు మీ నాన్న, పాతికవేలు కట్నం తీసుకుని! ఇప్పుడు నువ్వేమో కట్నం తీసుకున్నవాణ్ణి చేసుకోనని మొండిపట్టుపట్టావు. ఎవడొస్తాడే అంత ఉదారంగా?" అంది తల్లి.

"అయినా అంత ఔదార్యం నాకేం అక్కర్లేదులే. నా నలుపుని పట్టించుకోనివాణ్ణే చేసుకుంటాను. పెళ్ళి చేసుకోకపోతే జీవితం సాగదా? ఆ మూడు ముళ్ళూ వేయించుకోడానికి తలొంచుకోనక్కర్లేకుండా హాయిగా దర్జాగా ఉంటాను" అంటూ తల్లి చేసిన పకోడీలు రెండు పళ్లెంలోంచి తీసుకుంది.

"ఆ, హాయిగా దర్జాగా ఉందువుగాని! నేను ఇలాగే నీకు వేళకి అన్నీ అమర్చి పెట్టడానికి నీతో శాశ్వతంగా ఉంటాననుకుంటున్నావా?" అని బెదిరించింది శ్యామల.

"ఎవరూ శాశ్వతం కాదులే. నేనే నీకన్న ముందుగా-ఇప్పుడే పోతాననుకో-నీకూ నాకూ కూడా సమస్య ఉండదు కదా!" అంది సుహాసిని గంభీరంగా ముఖంపెట్టి.

"ఛీ, నోరుముయ్, ఏమిటామాటలు!" అంది తల్లి.

"అవునమ్మా, నువ్వేకదా అంటున్నావ్-ఇంతకన్న చావడం నయం అని. నేను మాత్రం అనుకోకూడదా? మీ కడుపున పుట్టి, నా చదువుకోసం మీ చేత అంత ఖర్చు పెట్టించి, చివరికి పెళ్ళి విషయంలో మీకు ఇంత నిరాశా, బాధా కలిగిస్తున్నందుకు నాకు మాత్రం ఆత్మహత్య చేసుకోవాలనిపించదా?" అని తల్లిని ఆట పట్టించడానికి అంటున్నా, సుహాసిని కంఠం వణికింది.

శ్యామల గబుక్కున గరిటని గట్టుమీద పడేసి కూతుర్ని గట్టిగా కౌగలించుకుంది. "ఇంకెప్పుడూ అలాంటి మాటలు అనకే తల్లీ" అంది ఏడుపు గొంతుతో.

సుహాసిని మెల్లిగా తల్లి చేతులు విడిపించుకుని, "నువ్వు కూడా ఇంకెప్పుడూ చావు మాట ఎత్తకమ్మా, ఇంకేదారీ లేనట్లు ప్రతిసారీ 'చావునయం' అనుకుంటావేం? సమస్య

ఎంత తీవ్రంగా ఉన్నా, ఆత్మహత్య పరిష్కారమార్గం కాదు కదమ్మా. నువ్వు చచ్చిపోతే మా సమస్య తీరిపోతుందా? నువ్వే ఆలోచించు" అంది తల్లిని సముదాయిస్తూ.

"నిజమేనే, నీకు సంబంధం ఏదీ కుదరడం లేదు. నలుగురికీ సంజాయిషీలు చెప్పుకోలేక చస్తున్నాను. ఇవన్నీ భరించలేక ఏదో గుటుక్కున మింగి చస్తే నయం అనిపిస్తుంది" అంది శ్యామల తన ఆలోచనని సమర్థించుకుంటూ.

"నువ్వు చీటికీ మాటికీ అలాంటి మాటలంటూంటే వినడంవల్లేనేమో, తమ్ముడు కిందటేడాది ఎం.సెట్. లో ర్యాంకు రాలేదని 'బేగాన్ స్ప్రే' తాగబోయాడు. సమయానికి నేను చూశాను కాబట్టి బతికిపోయాడు. ఇలా అధైర్యపడి ప్రతివాళ్ళూ చావడానికి ప్రయత్నించడమేనా? జీవితాన్ని ఎదుర్కోవడానికి సాహసం ఉండొద్దా? మరోదారి ఉండదా? మమ్మల్ని కనిపెంచిన దానివి, పెద్దదానివి, నువ్వే ఇలా పిరికితనాన్ని ప్రదర్శిస్తే ఎలాగమ్మా?" అంది సుహాసిని ఉద్రేకంగా.

శ్యామల బొటబొటా కన్నీళ్ళు కార్చింది.

తల్లిని దగ్గరికి తీసుకోవాలనిపించినా, అలాగే నిలబడి, "ఏడవడం కాదమ్మా చెయ్యవలసింది" అంది సుహాసిని.

"మరేం చెయ్యనే?.. నీ విషయంలో ఇప్పుడు మేమేం చెయ్యం? ఇంత చదువు చెప్పించాం. పనిపాటలు నేర్పించాం. ఆరోగ్యంగా ఉండేలా పెంచాం. ఇంకా ఏం కావాలే ఆ మగవాళ్ళకీ, వాళ్ళని కన్న వాళ్ళకీనూ?" అంది శ్యామల కీచుగొంతుతో.

"పెళ్ళిచేసి పంపించడం కోసమే కాదుకదమ్మా నన్ను తీర్చిదిద్దినది? నన్నొక వ్యక్తిత్వం ఉన్నదానిగా తీర్చిదిద్దారు. ఉద్యోగం చేసుకుంటూ నా కాళ్ళమీద నేను నిలబడగలను. నా జీవితాన్ని నాకిష్టమైన రీతిలో జీవిస్తాను. సరియైన వాడు దొరికినప్పుడు పెళ్ళి చేసుకుంటాను. పెళ్ళొక్కటే నా గమ్యం అనుకోకు. నాకు మరోదారి లేదనుకోకు" అంది సుహాసిని కచ్చితంగా.

తల్లి వంట పొయ్యి వైపుకి తిరిగింది, ఇష్టంగానో, అయిష్టంగానో. సుహాసిని ఇటు తిరిగి చూసేసరికి వంటింటి గుమ్మంలో ఎదురుగా తండ్రి!

ఎప్పుడొచ్చాడో సుహాసిని గమనించలేదు. ప్రోత్సాహకరమైన చిరునవ్వు కనిపించింది తండ్రి ముఖంలో. సగర్వంగా మందహాసం చేసింది సుహాసిని తండ్రికేసి చూస్తూ.

తెలుగు విద్యార్థి జనవరి 2007